క్లుప్తంగా

ప్రజలకు మంత్రి అంబటి శ్రీరామనవమి శుభాకాంక్షలు



సత్తెనపల్లి : రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడు ఆచరించిన జీవన విధానం పరి పూర్ణ మానవ జీవితానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. శ్రీరామ నవమి పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. శ్రీరాముని చల్లని దీవెనలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఇంట ఆనందం వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఆరోగ్యం పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



సత్తెనపల్లి : ఆరోగ్యం పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఏ.థౌషీద్ హుస్సేన్ అన్నారు. తాలూకా కోర్టు ప్రాంగణంలో డాక్టర్ కొంగర శ్రీకాంత్ పర్యవేక్షణలో కొనాక్ డయాగ్నోస్టిక్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత రక్త పరీక్షలు, ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఏ థౌషీద్ హుస్సేన్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ ప్రారంభించారు. న్యాయవాదులు, గుమస్తాలు, నాలుగు కోర్టుల సిబ్బంది, కక్షి దారులు, పోలీస్ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ కోర్టు ఏపీపీ బగ్గి నరసింహారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.అనిల్‌కుమార్, అన్నెం వెంకటకృష్ణారెడ్డి, సురే వీరయ్య, రాజవరపు.నరసింహారావు, గుమస్తాలు మర్రి నరసింహారావు, వలేటి రవి, గేరా రమేష్, తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా శ్లాస్ పరీక్ష

సత్తెనపల్లి : విద్యార్థుల్లో ఖచ్చితమైన సామర్థ్యాలు తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా మంగళవారం నాలుగో తరగతి విద్యార్థులకు శ్లాస్ పరీక్షను నిర్వహించారు. ఎంపిక చేసిన ఏడు పాఠశాలలకు పరీక్ష పత్రాలను సరఫరా చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి ఏ శ్రీనివాస రావు మాట్లాడుతూ విద్యార్థి తరగతి పూర్తయ్యేసరికి ఆ తరగతికి సంబంధించిన విద్యా సామర్థ్యాలు, పాఠశాల విద్య పూర్తయ్యేసరికి సాధించాల్సిన లక్ష్యాలను చేరుకోవాల్సి ఉంటుందన్నారు. పై తరగతిలోకి వెళ్లే ముందు కింది తరగతిలో సాధించాల్సిన అభ్యాసన ప్రక్రియలు సాధిస్తున్నారా? లేదా? అనే విషయాలను తెలుసుకునేందుకు విద్యాశాఖ ఏటా ర్యాండంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించడం జరుగుతుందన్నారు. దానిలో భాగంగా స్టూడెంట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే (శ్లాస్) పరీక్షలు నిర్వహించటం జరిగిందన్నారు. పట్టణంలోని 23వ వార్డు ఎంపీపీఎస్ పాఠశాల, రైల్‌పేట ఎంపీపీఎస్ పాఠశాల, యూనిక్ కాన్సెప్ట్ స్కూల్, కేంద్రీయ విద్యా లయం, మండలంలోని అబ్బూరు ఎంపీపీఎస్ (హెచ్‌ఈ), ధూళిపాళ్ల ఎంపీపీఎస్, రెంటపాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాల్గవ తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు తెలుగు, గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టులలో పరీక్ష నిర్వహించారు. మొత్తం 238 మంది విద్యార్థులకు గాను 216 మంది హాజరుకాగా 22 మందిగైర్హాజరయ్యారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

సత్తెనపల్లి : అగ్ని ప్రమాదాల సమయంలో అప్రమత్తత ముఖ్యమని, ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని సత్తెనపల్లి అగ్నిమాపక అధికారి ఎమ్.వి సుబ్బారావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఎస్‌జి అపార్ట్‌మెంట్ నందు అపార్ట్‌మెంట్ వాసులకు వంటింట్లో గ్యాస్ ఫైర్ అయినప్పుడు ఎలా ఎదుర్కోవాలనే దానిపై మంగళవారం అవగాహన కల్పించారు. అలాగే అంకమ్మ తల్లి గ్యాస్ గోడౌన్ సిబ్బందికి అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలో డెమో ద్వారా ప్రత్యక్షంగా చూపిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి సుబ్బారావు మాట్లాడుతూ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు లీకుల వల్ల కలిగే ప్రమాదాలను ఎలా నివారించాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలను వివరించారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించే ఆస్కారం ఎక్కువగా ఉంటుందని, మండే స్వభావం కలిగిన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు.

ప్రజలు చంద్రబాబు ఉచ్చులో పడవద్దు



ఊటుకూరులో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రచారం



పార్టీకండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న నంబూరు శంకరరావు

ఊటుకూరు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు : చంద్రబాబు ఉచ్చులో పడకుండా ప్రజలు మంచి చేసిన వారిని గుర్తించి ఓటు వేయాల పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. సీఎం జగన్ ఇస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం శ్రీలంక అవుతుందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు, ఇప్పుడు అవే పథకాలు ఇస్తానంటున్నాడని విమర్శించారు. జగన్ సంక్షేమ పథకాలతో రాష్ట్రం శ్రీలంక అయితే ఇప్పుడు చంద్రబాబు జగన్ పథకాలను తానూ అమలు చేస్తానని ఎందుకంటున్నారని ప్రశ్నించారు. క్రోసూరు మండలం ఊటుకూరులో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అమరావతి – బెల్లంకొండ రోడ్డు వేస్తేనే ఓటు అడుగుతానని చెప్పానని, ఇప్పుడు అది కూడా పూర్తి కాబోతుందని శంకరరావు చెప్పారు. ఊటుకూరులో గత ఐదేళ్లలో సుమారు రూ.43 కోట్లతో సంక్షేమ పథకాలు అందించామన్నారు. నాడు–నేడు ద్వారా స్కూళ్లు బాగు చేశామన్నారు. జలజీవన్ మిషన్ పనులతో ఇంటింటికీ మంచినీరు అందించే ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2 కోట్లతో కస్తల రోడ్డు వేయించానని, ఊటుకూరు – కోనూరు – అచ్చంపేట రోడ్డు కూడా పూర్తి చేశామన్నారు. గ్రామంలో ప్రతి సిమెంట్ రోడ్డు పూర్తి చేశామన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే అమరావతి – బెల్లంకొండ రోడ్డు వేస్తానని చెబుతున్నారని పూర్తి అయిన రోడ్డును ఆయన వేసేందుకు ఏముంటుందన్నారు.. ఈ కార్యక్రమంలో మండల గ్రామ సర్పంచ్ జెర్రిపోతు బుచ్చయ్య, పార్టీఅధ్యక్షుడు వెలదిఅప్పారావు, ఎంపీపీ పి.కోటయ్య, యార్డు చైర్మన్ ఈదాసాంబిరెడ్డి, నారుశ్రీనివాసరెడ్డి, జన్నవరపుశ్రీనివాసరెడ్డి, గార్లపాటిదాసు, మేదరరోశయ్య, పార్టీనాయకులు షేక్ గఫార్, జెడ్పీటీసీ షేక్ జమీలా, అనుముల కోటిరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి , షోషల్ మీడియా కార్యకర్తలు షేక్‌బాజి, సోషల్‌మీడియా కోకన్వీనర్ రవికిరణ్,మహిళలు,ప్రజలు అశేషంగా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ కార్యకర్తల చేరిక

పెదకూరపాడు : స్థానిక ముస్లిం కాలనీకి చెందిన టిడిపి కార్యకర్తలు పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు నంబూరు శంకరరావు సమక్షంలో వైయస్సార్‌సిపీ లో చేరారు. మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు మాజీ ఎంపిటిసి ఖాతున్, జిలాని కుటుంబం, కుమారుడు ముస్తఫా, సతీమణి షేక్ రిజ్వానా, బడేమీరా, బొల్లారం వలి,షేక్ సుఫియా, షేక్ ఖాతున్ షేక్ హుస్సేన్ బి,షేక్ మస్తాన్ బి,షేక్ హసీనా ,షేక్ రమీజున్‌లకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ. మరోసారి తనను ఆదరిస్తే పెదకూరపాడు నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిపి బెల్లంకొండ మీరయ్య, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌షరీఫ్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జలాలపురంలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

జననేత జగనన్నపై ప్రజలకు ఉన్న అభిమానం చూస్తుంటే రాష్ట్రంలో 2019 ఎన్నికల ఫలితాలు రిపీట్ కావడం ఖాయమని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలపరిధిలోని జలాలపురంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న పాలనలో మీ కుటుంబాలకు మంచి జరిగితేనే జగనన్నకు తోడుగా ఉండాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ, జనసేన కార్యకర్తలు

క్రోసూరు : క్రోసూరు మండలం నాగవరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు లక్కీ పోగు కృష్ణరాజు, క్రోసూరు గ్రామానికి చెందిన యాదల పుల్లారావు, తాళ్లూరు గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త వాసాల వెంకటేష్ మంగళవారం వైఎస్సార్సీపీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు స్వయంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్సీపీ గెలుపు కోసం అందరూ కలసి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్సీపీ నాయకులు, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికో నంబర్

సత్తెనపల్లి : వ్యవహారికంలో మనమందరం అసెంబ్లీ నియోజకవర్గం పేరుతో పిలుస్తాం. కానీ సాంకేతికంగా ఎన్నికల సంఘం విధుల్లో భాగంగా పరిశీలిస్తే ప్రతి నియోజకవర్గానికి ఓ నంబర్ ఉంటుంది. విద్యార్థులకు పాఠశాలల్లో ఇచ్చినట్లు ఓ క్రమసంఖ్య కేటాయించారు. దేశవ్యాప్తంగా ఇలాగే ఉంటుంది. ఎన్నికల కమిషన్ విధుల్లో ఈ నంబర్ ఆధారంగానే రిజర్వేషన్లు, విధుల కేటాయింపు, ఇతరత్రా అన్నీ పరిగణనలోకి తీసుకుంటారు. ఎన్నికల సమయంలో ఆయా నియోజకవర్గాల పేర్లతో పాటు నంబర్లను కూడా తప్పకుండా వినియోగిస్తుంటారు. పల్నాడు జిల్లాలోని ఏడు నియోజక వర్గాల నంబర్లు ఇవి.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా నంబర్లు ఇలా

నియోజకవర్గం	నంబర్
పెదకూరపాడు	85
చిలకలూరిపేట	96
నరసరావుపేట	97
సత్తెనపల్లి	98
వినుకొండ	99
గురజాల	100
మాచర్ల	101

సమాజాభివృద్ధికి పాఠశాలలే కేంద్రబిందువులు

పాఠశాలలను సందర్శించిన డీఈవో ఎం. వెంకటేశ్వర్లు

క్రోసూరు : సమాజాభివృద్ధికి పాఠశాలలే కేంద్రబిందువులని ప్రతి ఒక్కరు తెలుసుకునేలా ముందుకు సాగాలని డీఈవో ఎం. వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని ప్రాథమిక పాఠశాల(ఎస్టీ), ఆదర్శ పాఠశాలలను మంగళవారం డీఈవో అకస్మికంగా సందర్శించారు. సీబీఎస్ఈ తరగతులు జరుగుతున్న తీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనాల తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా డీఈవో ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆయన కోరారు. విద్యార్థులకు సీబీఎస్ఈ పాఠ్యాంశాలకు అనుగుణంగా విద్యాబోధన చేస్తూ విద్యార్థుల్లో సృజనాత్మకతను, విజ్ఞానాన్ని జోడిస్తూ వారిలో విద్యపట్ల , విలువల పట్ల అసక్తి కలిగేలా చూసుకోవాలని అధ్యాపకులకు సూచించారు. సమాజాభివృద్ధికి పాఠశాలలే కేంద్రబిందువులని ప్రతి ఒక్కరు తెలుసుకునేలా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మేరీసుజన్, పాఠశాల అధ్యాపకులు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ,ఎస్టీయుఏపి ప్రతినిధి ఎస్.రాఘవ పాల్గొన్నారు.



మోడల్‌స్కూల్‌లోవిద్యార్థుల పురోగతి అడిగి తెలుసుకుంటున్న డీఈవో ఎం.వెంకటేశ్వర్లు

ట్రాక్టర్ బోల్తా : వ్యవసాయకూలీ మృతి

తురకపాలెం (ముప్పాళ్ళ): ట్రాక్టర్ బోల్తా పడి వ్యవసాయకూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని తురకపాలెం సమీపంలో మంగళవారం జరిగింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తురకపాలెం కు చెందిన నాగోతు హృదయరాజు తన పొలంలో వ్యవసాయపనుల నిమిత్తం తన ట్రాక్టర్ పై నలుగురు కూలీలను తీసుకుని పొలానికి బయలుదేరాడు. ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే కాల్వలో పడటంతో ట్రాక్టర్ పై ఉన్న వ్యవసాయ కూలీలు ప్రమీల ,శాంతమ్మ, నాగేంద్రమ్మ, కృపావతి లతో పాటు హృదయరాజు కింద పడ్డారు. ఈ ప్రమాదంలో కృపావతి (28) అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. గాయపడిన ప్రమీల, శాంతమ్మ, నాగేంద్రమ్మలను చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రవేటు వైద్యశాలకు తరలించారు.

మృతదేహంతో పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన

ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన చిరుగూరి కృపావతి మృతదేహాన్ని సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందించారు. తమకు న్యాయం చేయాలంటూ కృపావతి బంధువులు ముప్పాళ్ళలోని పోలీస్‌స్టేషన్ ఎదుట మృతదేహంతో ఆందోళన చేపట్టారు. సత్తెనపల్లి–నరసరావుపేట ప్రధాన రహదారిపై మృతదేహాన్ని ఉంచి న్యాయం చేయాలంటూ కుటుంబసభ్యులు, బంధువులు రాస్తారోకో చేపట్టడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న సత్తెనపల్లి రూరల్ సీఐ ఎమ్.రాంబాబు ముప్పాళ్ళకు చేరి మృతుని కుటుంబసభ్యులతో మాట్లాడి ఆందోళన విరమింపచేశారు. మృతురాలికి ముగ్గురు ఆడ పిల్లలున్నారు. భర్త బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పీ.హజరతయ్య తెలిపారు.



ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు



కృపావతి మృతదేహం

జగనన్న పాలనలో ప్రతి ఇంటికి లబ్ధి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు నంబూరు వసంతకుమారి



పెదకూరపాడు : ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు నంబూరు వసంతకుమారి అన్నారు. మంగళవారం అమె మండల కేంద్రమైన పెదకూరపాడులో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ మహిళలు, వెనుకబడిన తరగతుల వారికి, పేదలకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేసిందన్నారు. ఎంపిపి బెల్లంకొండ మీరయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మస్తాన్ షరీఫ్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం

నకరికల్లు : ప్రాథమికస్థాయి నుంచి పునాది వేసుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రధానోపాధ్యాయులు మురళీస్వాములు ఉన్నారు. మండలంలోని చేజర్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో వార్షిక వేడుకలను మంగళవారం నిర్వహించారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్య బలోపేతం చేసేందుకు నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఉచితంగా దుస్తులు, మధ్యాహ్నభోజనం, నాణ్యమైన వసతులతో విద్యాబోధన అమలవుతుందన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

గురజాల : విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం మండల పరిధిలోని దైద గ్రామానికి చెందిన కేతావత్ శ్రీను నాయక్ తన ఇంటి సమీపంలో ఉన్న పంచాయతి పంపుకు విద్యుత్ మోటారు బిగించి నీటిని వాడుకునేవారు. రోజువారి లాగే మోటారు వేయడంతో నీరు రాక పోవడంతో వెళ్లి మోటారును ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో కేతావత్ శ్రీను నాయక్ అక్కడికక్కడే స్పృహ తప్పి కిందపడిపోగా క్షతగాత్రుడిని గురజాలలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహానికి పోస్టు మార్టం చేశారు. మృతుడి భార్య లక్ష్మీ భాయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మజ్జిగ కేంద్రాల ఏర్పాటు అభినందనీయం

వంశీ స్పెషాలిటీ వైద్యశాల వైద్యురాలు డాక్టర్ షకీలా శ్రీధర్‌రెడ్డి

సత్తెనపల్లి : మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేలా మజ్జిగ కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని వంశీ స్పెషాలిటీ వైద్యశాల వైద్యురాలు డాక్టర్ షకీలా శ్రీధర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం (పీఎస్‌వికె) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మంగళవారం అమె ప్రారంభించారు. మజ్జిగ చలివేంద్రానికి 10 రోజులకు అవసరమైన రూ.30 వేల నగదును ఆర్థిక సహాయంగా నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా పీఎస్‌వికె కన్వీనర్ పొట్టి సూర్య ప్రకాష్‌రావు మాట్లాడుతూ గతంలో కరోనా సమయంలో ఐసోలేషన్ సెంటర్, ఉచిత న్యాయ సేవ కేంద్రం, మెడికల్ క్యాంపు వంటి సేవా కార్యక్రమాలను దాతల సహాయంతో నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌వికె నిర్వాహకులు తేళ్ళ.వెంకటేశ్వర్లు, కోరంపల్లి.జగన్, కె.మాధవి, ఎ.వెంకటనారాయణ, గద్దె చల మయ్య, ప్రజా సంఘాల నాయకులు గుంటూరు విజయ్‌కుమార్, ఏవిఎన్ గోపాల రావు, కట్ట శివ దుర్గారావు, ఇంజం లింగయ్య, పొట్టి వీరేశం,ధరణికోట విమల, గద్దె ఉమాశ్రీ, తోరటి రాము, గుంటుపల్లి రజిని,పెండ్యాల మహేష్,పొట్టి మహేశ్వరి, గుంటూరు మల్లేశ్వరి, సుధారాణి, కట్ట రమాదేవి, పి శేషు, మునగాజ్యోతి, అరుణ పాల్గొన్నారు.

జగన్‌తోనే పారదర్శక పాలన

మంత్రి అంబటి రాంబాబు సతీమణి విజయలక్ష్మి

సత్తెనపల్లి : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తోనే పారదర్శక పాలన సాధ్యమవుతుందని మంత్రి అంబటి రాంబాబు సతీమణి అంబటి విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని 21వ వార్డులో మంగళవారం ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. కులాలు, మతాలు, వర్గాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించారన్నారు. మంత్రి అంబటి తనయ మనోజ్ఞ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని సంక్షేమ పథకాలు అందించి ఆదుకున్నారన్నారు. మహిళా విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీత హాసంతి మాట్లాడుతూ ఎన్ని పార్టీలు జతకట్టి వచ్చినా ఈ ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మి తులసి, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, కౌన్సిలర్లు కాకుమాను రవి, కుకుట్ల లక్ష్మి, కో ఆప్షన్ మెంబర్లు తుమ్మలక్ష్మీ సుజాత, కొణతం స్వాతి, నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, సెగ్గెం వెంకటేశ్వరరావు, రాయిడి విజయ, వల్లెం నరసింహరావు, ఎస్‌ఎం యూనస్, కళ్యాణ్ పాల్గొన్నారు.



పట్టణంలోని 21వ వార్డులో ఎన్నికల ప్రచారంలో అంబటి విజయలక్ష్మీ, అంబటి మనోజ్ఞ

ఎన్నికల నిర్వహణలో బీఎల్ఓల పాత్ర కీలకం

సత్తెనపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ

సత్తెనపల్లి : సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓలు) పాత్ర కీలక మని సత్తెనపల్లి ఆర్డీవో, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నియోజకవర్గంలోని బీఎల్వోలు, సెక్టార్ అధికారులకు మంగళవారం నిర్వహించిన శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్లిప్పుల పంపిణీ, ఏఎస్డీ లిస్టుల తయారీ, హోమ్ ఓటింగ్‌కు సంబంధించి ఫారం–12డీ దరఖాస్తుల అందజేయడంలో కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని స్థితిలో ఉన్న 40 శాతం మించి వైకల్యం ఉన్న దివ్యాంగులకు, 85 సంవత్సరాల వయసు పైబడిన వృద్ధులకు హోం ఓటింగ్ అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. దీనికి పోస్టల్ బ్యాలెట్ తరహాలోనే ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫారం–12డీ దరఖాస్తు పొందిన తర్వాత ఎవరైనా సరే పోలింగ్ బూత్ వద్దకు వెళ్లి ఓటేయగలమంటే వారిని దానికి అనుమతించాలన్నారు. హోం ఓటింగ్ కావాలనుకునేవారు ముందుగా ఫారం–12డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరిశీలన అనంతరం అర్హులైన వారి జాబితాను ఈఆర్వో స్థాయిలో రూపొందిస్తారన్నారు. అర్హులైన ఓటర్లకు ఏ రోజు ఓటు వేయాలో ముందుగానే సమాచారం ఇవ్వడం జరుగుతుందన్నారు. మొబైల్ ఓటింగ్ వాహనం ద్వారా ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని వారికి కల్పిస్తారన్నారు. బ్యాలెట్ పేపర్ పై రహస్యంగా ఓటు వేసేలా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ ప్రక్రియ అంతా వీడియో తీస్తారన్నారు. ఆ ఓటును సీల్ చేసిన అనంతరం సంబంధిత తహశీల్దార్ కార్యాలయం ద్వారా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తరలిస్తారన్నారు. ఈ సందర్భంగా బీఎల్ఓలకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ఏఆర్వోలు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, తహశీల్దారులు సిహెచ్ ఉష (సత్తెనపల్లి), ఎల్ లక్ష్మీ నారాయణ (నకరికల్లు, రాజు పాలెం), పి. శింగారావు (ముప్పాళ్ళ), ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ బోస్ బాబు, 31 మంది సెక్టార్ అధికారులు, 274 మంది బీఎల్వోలు, ఉన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ

వలంటీర్ల స్వచ్ఛంద రాజీనామా

నకరికల్లు : ప్రజాసేవకు అడ్డంకిగా ఉన్న ఉద్యోగాలు తమకు అక్కరలేదంటూ మండలంలోని నర్సింగపాడు, కుంకలగుంట గ్రామాలకు చెందిన వలంటీర్లు మంగళవారం స్వచ్ఛందంగా తమ పోస్టులకు రాజీనామా చేసి రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేశారు. మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలను కలసి పార్టీ కార్యక్రమాల్లో తమ సేవలు వినియోగించుకోవాలని కోరారు.

రెండు గ్రామాల వలంటీర్లు రాజీనామా

ముప్పాళ్ళ : మండలంలోని నార్నెపాడు, పలుదేవర్లపాడు గ్రామాలకు చెందిన 25 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం రాజీనామాలు అందించారు. నార్నెపాడుకు చెందిన 15 మంది పలుదేవర్లపాడుకు చెందిన 10 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను ఎంపీడీవో కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ ఎస్.నాయక్‌కు అందించారు. ప్రతిపక్షపార్టీల నాయకులు వలంటీర్ల పై చేస్తున్న విమర్శలు తీవ్ర మనస్తాపానికి గురి చేస్తున్నాయని, సేవాభావంతో పనిచేస్తున్న వలంటీర్ల పట్ల అనుచిత వాఖ్యలు చేయటం దుర్మార్గమని వలంటీర్లు దావల వినోద్‌కుమార్, షేక్ జనత్‌హుస్సేన్, లోకం సుమన్, మద్దూరి సురేంద్రరెడ్డి, సంగం విజబాబు, గౌర్రెపాటి రాహుల్, నక్కా నాగ మల్లీశ్వరి, కీసీడీ గోపీనాథ్ తెలిపారు.

29 మంది వలంటీర్లు రాజీనామా

సత్తెనపల్లి : పట్టణంలోని 4వ సచివాలయంలో ఇద్దరు, 5వ సచివాలయంలో ఒకరు, 7వ సచివాలయంలో ఒకరు, 14వ సచివాలయంలో నలుగురు మొత్తం 8 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మికి అందజేశారు. సత్తెనపల్లి మండలం గర్నెపూడి గ్రామానికి చెందిన ఇద్దరు, కంకణాలపల్లికి చెందిన 10 మంది, పాకాలపాడుకు చెందిన ఒకరు, పణిదంకు చెందిన ఒకరు, కందుల వారిపాలెంకు చెందిన ఏడుగురు మొత్తం 21 మంది రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో జగదీష్ కు అందించారు.

10 మంది వలంటీర్లు రాజీనామా

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న 10మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. ప్రతిపక్ష పార్టీలు వలంటీర్లపై విష ప్రచారం చేస్తుండటంతో తీవ్ర మనస్థాపం చెందిన వలంటీర్లు షేక్ అల్లాభక్షు, మునగా గిరిష్‌కుమార్, షేక్ హుస్సేన్‌షా, మెట్ల శ్రీనివాసరావు, పసుపులేటి నాగలక్ష్మీ, త్రివేణి, కొలా సైదిరెడ్డి, చల్లపల్లి ఝాన్సీతో పాటు మరో ఇద్దరు వలంటీర్లు రాజీనామాలు చేసి పత్రాలను కమిషనర్‌కి అందజేశారు.



మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మికి రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు

